సాక్షి
కాకినాడ
ఆదివారం | 15 | అక్టోబర్ | 2023



అన్నదానానికి విరాళం


కపిలేశ్వరపురం:అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానానికి శనివారం మోటిపల్లి రామచంద్రరావు, కృష్ణవేణి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.25 వేల విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 11.60అడుగులకు నీటి మట్టం చేరింది.

పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానాలు



మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రమైన పిఠాపురం పాదగయలో శనివారం పిండ ప్రదానాలు చేయడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటైన పాదగయకు ప్రత్యేకత ఉంది.

10లో

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన జగ్గంపేట హైస్కూల్ విద్యార్థులు

జగ్గంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జగ్గంపేట ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.శివ, బి.మురళి శనివారం తెలిపారు. కాకినాడ డీఎస్సీ మైదానంలో శుక్రవారం జరిగిన కబడ్డీ, జూడో పోటీల్లో జగ్గంపేట హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో 10 మంది బాలికలు, నలుగురు బాలురు ఉన్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీలకు మేడిశెట్టి మహాలక్ష్మి, పాలిక భవానీ, గోపి సాత్విక, సాయికళ, కాలి రాజేష్ ,మర్రి శ్యామ్, అండర్–14 కబడ్డీ పోటీలకు ఎ.గంగా భవానీ, సీహెచ్ ప్రసన్న, పి.వాణి అమూల్య, ఎం.అను, శశాంత్, జూడో పోటీలకు కె.రాజేష్, ఎస్కే అబ్దుల్ కలాం, ప్రసన్న ఎంపికయ్యారని వివరించారు. వీరు నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం టీవీఎస్ రంగారావు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, పాఠశాల పీఎంసీ చైర్మన్ రమణ, స్టాఫ్ సెక్రటరీ కృష్ణమోహన్, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు ఎం.మురళి, బి.శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

పొగాకు అధిక సాగుతో ఇబ్బందులు పడవద్దు

గోపాలపురం: పొగాకు బ్యారన్‌కు 35 క్వింటాళ్ల మాత్రమే ఉత్పత్తి చేయాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం ఆదిశేషయ్య సూచించారు. ఒక్కో రైతు నాలుగు ఎకరాలలో సాగు చేయాలన్నారు. అధికంగా సాగు చేసి ఇబ్బందులకు గురికావద్దన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద శనివారం వేలం నిర్వాహణాధికారి అమ్మూల్ శ్యామ్ అధ్యక్షతన దేవరపల్లి, గోపాలపురం మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి చూపాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు ఉత్పత్తి ఉండాలన్నారు.

వ్యాపారాలు దండి.. ఆస్పత్రికి గండి



పేరుకు ఇది టెలిఫోన్ బూత్. టెలిఫోన్ బూత్ పేరుతో కొనసాగుతున్న జనరల్ స్టోర్

- జీజీహెచ్‌లో వ్యాపారుల నిర్వాకం
- భారీగా ఆర్జిస్తున్నా చెల్లించని అద్దెలు
- పేరుకుపోతున్న బకాయిలు
- కరెంటు బిల్లులూ ఎగ్గొడుతున్న వైనం
- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం
- విచారణలో విస్తుపోయే వాస్తవాలు

కాకినాడ క్రైం: వేలం సమయంలో బతిమాలి మరీ అనుమతులు దక్కించుకున్న వ్యాపారుల అసలు రంగు బట్టబయలవుతోంది. ఆసుపత్రి అధికారుల అలసత్వాన్ని అదనుగా తీసుకొని చెలరేగి పోతున్న వీరి వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించారు. ప్రత్యేక బృందం తనిఖీల్లో బయటపడుతున్న వీరి నిర్వాకం ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. రూ.లక్షలాది నిధులు హెచ్‌డీఎస్(హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఖాతాకు చెందకుండా చేస్తున్నారు. వీరి

అలసత్వం వెనుక ఆసుపత్రిలో కొందరి పాత్ర కూడా ఉందని ప్రత్యేక బృందం నిర్ధారించింది. వారి పాత్రను కలెక్టర్ ముందు ఉంచింది. అద్దెలు కరెంటు బిల్లులు చెల్లించక హెచ్‌డీఎస్ ఖాతా దాదాపుగా ఖాళీ అయింది. దీంతో ఆసుపత్రిలో రోగుల ప్రాణ రక్షణకు చేపట్టిన కీలక అభివృద్ధి పనులన్నీ స్థంభించిపోయాయి. కొన్ని నెలలుగా చిరుద్యోగులు జీతాల్లేక విలవిలలాడుతున్నారు. రోగులపై ఆధారపడి వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారు మాత్రం నెల గడిస్తే రూ.లక్షల్లో లాభాలను వెనకేసుకుంటున్నారు. అయినా అద్దె మాత్రమే కాదు, కరెంటు బిల్లులు కూడా చెల్లించడం లేదు. ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన మొత్తాలను నెలలకు నెలలు బకాయి పెడుతున్నారు. దీంతో ఆసుపత్రి అభివృద్ధి కుంటు పడుతోంది.

కలెక్టరే చైర్మన్...

కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జీజీహెచ్ హెచ్‌డీఎస్ ఖాతా నిధులు లేక అడుగంటడం చర్చనీయాంశమైంది. ఈ ప్రాతిపదికలోనే అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులపై కలెక్టర్ కృతికా శుక్లా కొరడా ఝులిపించారు. వారం రోజుల్లో పూర్తి స్వరూపం మారాలని ఆమె గట్టి ఆదేశాలిచ్చారు. జీజీహెచ్‌లో వ్యాపారాల కోసం కేటాయించిన దుకాణాల అద్దెలు అక్షరాల ప్రతి నెల రూ.5.30 లక్షలు. ఇది కాకుండా విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయం రూ.లక్షల్లో ఉంటుంది. డాక్టర్ రాఘవేంద్రరావు సూపరింటెండెంట్‌గా వ్యవహరించిన సమయంలో దాదాపు ఐదేళ్ల క్రితమే పాత అద్దెలను పునః పరిశీలించి జీజీహెచ్ ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో జరుగుతున్న వ్యాపారాలకు అనుగుణంగా కలెక్టర్ అనుమతితో సవరించారు. మొత్తం 9 దుకాణాలతో ఈ అద్దెలు సమకూరుతున్నాయి. కాగా కొందరు ఒక దుకాణం పేరుతో తీసుకుని మరొక వ్యాపారం నిర్వహిస్తున్నట్లు కూడా తాజాగా బయటపడింది.

టెలిఫోన్ బూత్‌ల పేరుతో జనరల్ స్టోర్‌లు

జీజీహెచ్‌లో టెలిఫోన్ బూత్‌ల పేరుతో అనుమతులు పొంది దాదాపుగా మినీ సూపర్ మార్కెట్లు తరహా జనరల్ స్టోర్‌లు నిర్వహిస్తున్నారు. చేస్తున్న అసలు వ్యాపారాలతో అనుమతులు తీసుకుంటే అధిక అద్దెలు చెల్లించాలి. ఈ దుకాణాల్లో దొరకని వస్తువంటూ ఉండదు. ఆ దుకాణాల్లో అమ్మకాలన్నీ ఎంఆర్‌పీ ధరలను మించే అమ్ముతున్నారు. గైనిక్ విభాగం ఎదురుగా టెలిఫోన్ బూత్ పేరుతో ఉన్న ఓ దుకాణం నుంచి ఓ రోగి బంధువు కొబ్బరికాయ రూ.50లకు కొని లబోదిబోమన్నాడు. క్యాజువాలిటీ సమీపంలో టెలిఫోన్ బూత్ పేరుతో ఏర్పాటైన దుకాణ యజమాని దుకాణం వెనుక భాగం ప్రాంతం మొత్తం ఆక్రమించి లక్షలు అర్జిస్తూ రూ.లక్షల్లో అద్దెలు, విద్యుత్ బిల్లులు బకాయి పెట్టాడు. బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఉన్న టెలిఫోన్ బూత్ పేరుతో నిర్వహిస్తున్న మరో దుకాణంలో మంచినీళ్ల సీసా ఖరీదు రూ.30. ఇనుప రేకులతో నిర్మించిన ఈ దుకాణంలో విద్యుదాఘాతం చోటు చేసుకుంది.

విద్యుత్ బాకాయిలు రూ.42 లక్షలు

జీజీహెచ్‌లో అద్దెలు చెల్లిస్తున్న తీరు మాత్రమే దయనీయం అంటే విద్యుత్ బాకాయిల వ్యవహారం మరింత దారుణంగా ఉంది. ఆర్ఎంసీ స్టూడెంట్ క్యాంటీన్, టీ బడ్డీ జీజీహెచ్, ఏపీఎం ఈయూ క్యాంటీన్, ఆర్ఎంసీ ఎక్స్‌టెన్షన్ కౌంటర్, జెనెరిక్ మెడికల్ షాప్, మిల్క్ అండ్ బ్రెడ్ షాప్, క్యాజువాలిటీ ఎస్‌టీడీ బూత్, ఎస్‌టీడీ బూత్ జీజీహెచ్, ఎస్‌టీడీ బూత్ బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌టీడీ బూత్ గైనిక్ బ్లాక్, క్లాస్ ఫోర్ సిబ్బంది క్యాంటీన్, ఎస్ఎల్‌డీసీ ఎంఆర్ఐ స్కాన్, ఎస్‌టీపీ సివిల్ వర్క్స్, నెఫ్రోకేర్, ఎస్ఎల్‌డీసీటీ స్కాన్(అంబానీ), మోడరన్ సులభ్ కాంప్లెక్స్, జన్మభూమి సులభ్ కాంప్లెక్స్, ఎంటరియా ల్యాబ్, ట్రామాకేర్(సీవోటీ), మోడరన్ సులభ్ కాంప్లెక్స్ క్యాన్సర్ గేట్ ఇలా 19 వ్యాపార కేంద్రాల, కార్పోరేట్ ఆరోగ్య సేవ, నిర్మాణ పనుల విద్యుత్ బిల్లుల భారాన్ని నేరుగా జీజీహెచ్చే భరిస్తోంది. ఈ బకాయిలే రూ.42 లక్షలు ఉన్నాయి. యూనిట్‌కు రూ.12 చొప్పున వీరు తమ వ్యాపారాల కోసం వెచ్చించిన విద్యుత్ యూనిట్లకు బిల్లు చెల్లించాల్సి ఉంది. ఈ సంస్థల్లో కొన్ని 2019 నుంచి కూడా చెల్లించని సంస్థలు ఉన్నాయి.

తాళాలు వేయించాం



అద్దెలు, విద్యుత్ బిల్లుల బకాయిలు, తద్వారా హెచ్‌డీఎస్ నిధులకు లోటు అంశాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఈ వ్యవహారాన్ని నేరుగా ఆమె చేతుల్లోకే తీసుకున్నారు. కలెక్టర్ ప్రత్యేక బృందం పరిశీలన చేపట్టి పరిస్థితిని నిర్ధారించుకుంది. ఏ అనుమతులు పొందారు.. ఏ దుకాణాలు కొనసాగిస్తున్నారు అనే అంశాన్ని తీవ్రంగా పరిగణించనున్నారు. వారం రోజుల గడువు ముగిసింది. బకాయిలు చెల్లించని వ్యాపారస్తుల దుకాణాలకు తాళాలు వేయించాం. కొందరు నెమ్మదిగా స్పందించి ఇప్పుడిప్పుడే బకాయిలు చెల్లింపునకు ముందుకొస్తున్నారు. బకాయిలు చెల్లించని వ్యాపారస్తుల అనుమతులు ఒప్పందాన్ని అనుసరించి రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో ఆసుపత్రి అధికారుల బృందం ఈ అంశాన్ని పర్యవేక్షిస్తోంది.

– డాక్టర్ లావణ్యకుమారి, జీజీహెచ్ సూపరింటెండెంట్



హెచ్‌డీఎస్ నిధులు ఎందుకంటే...

పరికరాల మరమ్మతులు, అత్యవసర మందులు, అధికారిక వాహనాలకు ప్రత్యేక పరిస్థితుల్లో ఇంధనం, స్థానికంగా సమకూర్చుకునే మందులు, పలు వర్గాల ఉద్యోగులకు జీతాలు, ఆసుపత్రిలో వివిధ కార్యక్రమాల నిర్వహణ, కలెక్టర్ అనుమతితో నిర్మాణాల్లో వెచ్చించే మొత్తాలు, రోగుల సంరక్షణ కోసం నిర్వహించే వివిధ కార్యక్రమాలకు నిధులు హెచ్‌డీఎస్ నుంచే వెచ్చిస్తారు. ఈ ఖాతా ఖాళీ అవ్వడంతో ప్రస్తుతం వీటిన్నంటి నిర్వహణ కష్టసాధ్యమవుతోంది. ఓ వైపు ఆరోగ్యశ్రీ ఉద్యోగులు జీతాలు అందక ఇబ్బందులు పడుతుంటే ఆరోగ్య శ్రీ ప్రోత్సాహకాలను మొత్తాన్ని హెచ్‌డీఎస్‌కు సమకూర్చక తప్పని పరిస్థితి కొనసాగుతోంది.



మిల్క్ అండ్ బ్రెడ్ షాప్ అనుమతులతో జీజీహెచ్ మెయిన్ గేట్ వద్ద కొనసాగుతున్న జనరల్ స్టోర్

సౌత్ జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: విలువైన సమయంలో కొంత క్రీడలకు కేటాయించి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు విద్యార్థులకు సూచించారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజులపాటు జరిగే సీబీఎస్ఈ సౌత్ జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం ద్వారా శరీర ధృడత్వంతోపాటు మానసిక ఉత్తేజం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యానికేతన్ సహాయ కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కేలం శ్రీనివాస్, పరిశీలకులు ఎస్. గంగాధరం, ప్రిన్సిపాల్స్ ఎంవీవీఎస్ మూర్తి,ఎఎస్ఎన్ మూర్తి, అకాడమీ కోఆర్డినేటర్ ఎం. విమల, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి ధరుడు సత్యదేవుడు

- ముత్యాల వస్త్రాలతో ఇక దర్శనం
- వ్రతపురోహితుల విరాళంతో తయారీ
- చొరవ తీసుకున్న ఆలయ ఈఓ ఆజాద్
- తొలి పూజలు చేయనున్న శారదా పీఠాధిపతి



సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరులకు రూపొందించిన ముత్తంగి వస్త్రాలు, పక్కన సత్యదేవుని శిరస్సు మీద గొడుగు



ముత్తంగి వస్త్రాలు అందచేసిన అనంతరం సత్యదేవుని సన్నిధిలో సుధీర్ చరణ్ కుటుంభసభ్యులు

అన్నవరం: అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు ముత్తంగి వస్త్రాల (ముత్యాలతో తయారైన)తో దర్శనమివ్వనున్నారు. ఈ వస్త్రాలు ఇప్పటి వరకు శ్రీరంగంలోని రంగనాథుడు, తిరుపతిలోని మలయప్పస్వామి, భద్రాచలంలోని శ్రీరామచంద్రుడు మాత్రమే ధరిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ముత్తంగి వస్త్రాల కళాకారుడు సుధీర్ చరణ్ కుటుంబం వీటిని రూపొందించి ఆదివారం దేవస్థానానికి సమర్పించింది. ముత్యాల వస్త్రాల తయారీకయ్యే రూ.8.5 లక్షలను దేవస్థానం వ్రత పురోహిత సంఘం విరాళంగా సమర్పించింది.

ఆశ్వీయుజ శుద్ధ విధియ, సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి ముత్తంగి అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను దర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం దర్శనానికి భక్తులను అనుమతిస్తారని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

ఇదో ప్రాచీన కళ

మంచి ముత్యాలు, పగడాలు, కెంపులతో ముత్తంగి వస్త్రాలు రూపొందించి అందజేయడం తమ పూర్వజన్మసుకృతమని ముత్తంగి వస్త్రాల కళాకారుడు సుధీర్ చరణ్ చెప్పారు. దేవతామూర్తులకు ముత్యాలతో ముత్తంగి తయారు చేయడం ప్రాచీనమైన కళ అన్నారు. దీనినివందేళ్లుగా పూర్వీకుల వద్ద నుంచి కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. తమిళనాడులోని శ్రీరంగంలో 12 అడుగుల పొడవున పవళించి ఉండే శ్రీరంగనాథునికి 17వ శతాబ్దంలో నాయకర్ రాజులు ముత్తంగి' తయారు చేయించినట్టు చరిత్ర చెబుతుందన్నారు. తిరుమలలో, భద్రాచలంలో కూడా తమ పూర్వీకులే తయారు చేయించి అలంకరించారన్నారు. అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలతో ఇప్పుడు ఈ వస్త్రాలను తయారు చేశామన్నారు. సుమారు మూడు కిలోల మంచి ముత్యాలు, కెంపులు, మణులతో రూపొందించామన్నారు. నవరత్నాలతో కూడిన స్వర్ణ హారాన్ని కూడా ఇందులో పొదిగామన్నారు. ముత్తంగి తయారీలో తనతోపాటు భార్య ప్రియాంక, తల్లి రేఖ, కుమార్తె హృదయ, చిన్నమ్మలు కృష్ణవేణి, విజయంతి, కుటుంబ సభ్యులు రాఖీ, కజిన్ భార్గవి పాలు పంచుకున్నారన్నారు.



ముత్తంగి వస్త్రాలు పరిశీలిస్తున్న శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ

రేపట్నుంచి అలంకరణ



చంద్రశేఖర్ అజాద్, ఈఓ

సోమవారం తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారు, శంకరులను ముత్తంగి వస్త్రాలతో అలంకరించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ తొలి పూజలు చేస్తారన్నారు. తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఇకపై ప్రతీ సోమవారం ముత్తంగి అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు, శంకరుడు దర్శనమిస్తారన్నారు. వ్రతపురోహిత సంఘ నేత నాగాభట్ల రవిశర్మ మాట్లాడుతూ తమ సంఘం తరుపున రూ.8.5 లక్షలతో ముత్తంగి తయారు చేయించి సమర్పించడం వ్రతపురోహితుల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కాగా ఈ ముత్తంగిని ఇక్కడి అధికారులు విశాఖ శారదా పీఠానికి తీసుకు వెళ్లి పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలకు చూపించారు.

శరన్నవరాత్ర వేడుకలకు ఆలయాలు సిద్ధం

రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవారు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాలకు జిల్లాలోని ప్రముఖ ఆలయాలు సిద్ధమయ్యాయి. 10 రోజులు పాటు శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. రోజూ అమ్మవారు వివిధ రకాల అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారిని తిలకించేందుకు భారీగా తరలివచ్చే భక్తులకోసం దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేశారు. టిక్కెట్‌తోపాటు ఉచిత దర్శనం కూడా వీలైనంత త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆధికారులు ఆదేశాలు జారీ చేశారు. మరోపక్క అమ్మవారి ఆలయాలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ముఖద్వారం వద్ద ఆకర్షణీయంగా విద్యుద్దీపాలంకరణ చేశారు. తొలిరోజు విల్లంబులు, 16న ఊయల, 17న పుస్తకపాణి, 18న వీణాపాణి, 19 జపమాల, 20న సింహారోహణ, 21న రక్తబీజాక్షుని వధ, 22న మహిషాసురమర్ధిని, 23న బాలాత్రిపుర సుందరి అమ్మవారు బంగారం చీరలో భక్తుల దర్శనమివ్వనున్నారు.



కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ముఖద్వారం

ఆలయాలలో ఏర్పాట్లు

సామర్లకోట బాలాత్రిపురసుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బాలాత్రిపుర సుందరిదేవీ, 16న అన్నపూర్ణ, 17న గాయత్రీదేవి, 18న లలితాదేవి, 19న మహాలక్ష్మి, 20న సరస్వతి, 21న మహిషాసురమర్ధిని, 22న విజయదుర్గ, 23 రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో భక్తులు తాకిడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరి అమ్మవారు ఈ నెల 15న రాజరాజేశ్వరిదేవి, 16న బాలాత్రిపురసుందరీ, 17న అన్నపూర్ణాదేవి,18న గాయత్రిదేవి, 19న కాళికాదేవి, 20న సరస్వతీదేవి, 21న లక్ష్మీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్ధిని అలంకరణ 24న విజయదుర్గాదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. తుని తలుపులమ్మ అమ్మవారి ఆలయంలో 15 నుంచి ఈ నెల 24, శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్నవరంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వనదుర్గ అమ్మవారు, కనకదుర్గమ్మవారు, దర్బారు మండపంలోని అనంతలక్ష్మి సత్యవతి అమ్మవార్లకు 10 రోజులు పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

భారీగా చిక్కిన టేకు చేపలు



మత్స్యకారులకు చిక్కిన టేకు చేపలు

కాకినాడ రూరల్: సముద్రంలో టేకు చేపలు అరుదుగా లభిస్తుంటాయి. కాకినాడ కుంభాభిషేకం వద్ద మత్స్యకారుల వలకు శనివారం ఇవి భారీగా చిక్కాయి. సాధారణంగా 5 కిలోల నుంచి 30 కిలోల వరకూ లభ్యమయ్యే ఈ టేకు చేపలు 50 కిలోల బరువు ఉండటం విశేషం. వీటిని హౌరాలో విక్రయించేందుకు ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. కిలో రూ.120 నుంచి రూ.160 వరకూ ధర పలికింది.

కౌశల్ క్విజ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కౌశల్ 2023 క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని కాకినాడ డీఈఓ జి.నాగమణి సూచించారు. శనివారం స్థానికంగా తన చాంబర్‌లో క్విజ్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 8 నుంచి 10వ తరగతుల విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నవంబర్ 5వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు రాష్ట్ర స్థాయి ప్రతిభావంతులకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినిల్, బాలల సైన్స్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కౌశల్ క్విజ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాకినాడ జిల్లా డీఈఓ నాగమణి తదితరులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

కాకినాడ క్రైం: కాకినాడ బస్టాండ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద గంజాయిని తమ ప్రాంతానికి తరలించేందుకు యత్నిస్తున్న నలుగురు తమిళులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ సెబ్ సౌత్ స్టేషన్ పరిధిలో జరిగిన తనిఖీలలో నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి 28 కిలోల గంజాయితో పాటు నగదు, రెండు కీపాడ్ ఫోన్లు, రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సహా స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.1.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

పాదగయ క్షేత్రంలో
పిండ ప్రదానాలు

భారీగా తరలివచ్చిన భక్తులు


పిఠాపురం: మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రమైన పిఠాపురం పాదగయలో శనివారం పిండ ప్రదానాలు చేయడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటైన పాదగయకు ప్రత్యేకత ఉంది. గోదావరి పుష్కర కాలంలో విశేషంగా ఒడిశా రాష్ట్రం నుంచి ఒడ్డర్లు కనీసం ఇంటికి ఒకరైనా వచ్చి రాజమహేంద్రవరం గోదావరిలో స్నానం మాత్రమే చేసి పిఠాపురంలో ఈ పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానం చేయడం తరతరాలుగా ఆచారంగా వస్తుంది. ఇక్కడ చేసే పిండ ప్రదానం నేరుగా గయాసురుని పాదాల ద్వారా పితృ దేవతలకు చేరుతుందనే నానుడి ఉండడంతో దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు పిండ ప్రదానాలు చేయడానికి వస్తుంటారు. దీంతో మహాలయ అమావాస్య సందర్భంగా పాదగయ క్షేత్రంలో శనివారం ఒక్క రోజే సుమారు 2 వేల మంది పిండ ప్రదానాలు జరిగాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పాదగయలో పిండ ప్రదానాలకు వచ్చిన భక్తులు

ఆలయ శిఖరాన అబ్బురం

కాకినాడ రూరల్: మలి సంధ్య వేళ సూర్యభగవానుడి కిరణాలు కనువిందు చేశాయి. మబ్బుల మధ్యలో ఎర్రని, సింధూరం, నలుపు వర్ణాల నడుమ సూర్యుడు పడమర దిక్కున అస్తమిస్తూ ముచ్చట గొలిపాడు. సర్పవరంలోని పురాతన ప్రసిద్ధి గాంచిన రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం వద్ద గోపురంపై సుదర్శన చక్రాన్ని తాకుతున్నట్లు కనిపించిన సూర్య కిరణాలు భక్తులను పరవశింపజేశాయి. శుక్రవారం సాయంత్రం ఈ చిత్రాన్ని ఓ భక్తుడు తన ఫోన్‌లో బంధించాడు.



ఆలయ గోపురం శిఖర సుదర్శన చక్రాన్ని తాకినట్టుగా సూర్యుని కాంతులు

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ శుభం కాపు కల్యాణ మండపంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి యూత్, సీనియర్స్ ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పోటీల నిమిత్తం కల్యాణ మండపంలో ఫెన్సింగ్ పిస్టులు 10 ఏర్పాటు చేశారు. 13 జిల్లాల నుంచి 333 మంది క్రీడాకారులు హాజరుకాగా, ఇందులో 150 మంది మహిళలు, 200 పురుషులు ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన మహిళలకు డీఎస్ఏలో, పురుషులకు కాపు కల్యాణ మండపంలో వసతి కల్పించారు. యూత్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ ప్రక్రియను రాష్ట్ర సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్, జిల్లా అధ్యక్షుడు సింహాద్రి పవన్ వికాస్, కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

కవల కపిల దూడల జననం



కవల కపిల దూడలతో రైతు వెంకట్రావు

రాయవరం: సాధారణంగా ఆవు లేకుంటే, గేదెకు ఒక దూడ జన్మించడం జరుగుతుంది. రాయవరం మండలం లొల్ల గ్రామానికి చెందిన రైతు బులుసు వెంకట్రావుకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒంగోలు జాతికి చెందిన ఈ ఆవుకు రెండు కపిల గిత్తలు జన్మించడం పట్ల రైతు వెంకట్రావు ఆనందానికి అవధులు లేవు. కపిల గిత్తలను చూసేందుకు పలువురు ఆసక్తిగా తరలివచ్చారు. సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ తదితరులు కపిల దూడలను పరిశీలించారు.

కాలువలో పడి యువకుడి మృతి



జుత్తిగ పోశియ్య మృతదేహం

గోపాలపురం: తాడిపూడి కాలువలో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు ఏఎస్సై కె.శోభనాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన జుత్తిగ పోశియ్య (30) తన స్నేహితులతో కలసి గోపాలపురం మండలం పెద్దాపురం తాడిపూడి కాలువలో ఈత కొట్టడానికి వెళ్లాడు. రెండు సార్లు గట్టుపై నుంచి కాలువలోకి దూకాడు. మూడోసారి దూకిన పోశియ్య కాలువలో కొట్టుకుపోయాడు. గజ ఈతగాళ్ల సాయంతో పోశియ్య మృతదేహాన్ని బయటకు తీయించినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. అతని అన్నయ్య హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భవిష్యత్ వైద్య పరిశోధనలకు ప్రయోగశాల

కోనసీమలో గ్లోబల్ నెక్ట్స్ జెన్ మెడికేర్ కంపెనీ సర్వే



మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో డాక్టర్ ఆనంద పద్మనాభన్ రాఘవాచారి అయ్యంగార్

సాక్షి, అమలాపురం: భవిష్యత్ వైద్య పరిశోధనలకు అనువుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వంద ఎకరాల్లో ప్రయోగశాల ఏర్పాటుకు చెన్నైకి చెందిన ఇన్ గ్లోబల్ నెక్ట్స్ జనరేషన్ మెడికేర్ కంపెనీ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఆ సంస్థ చైర్మన్, అంతర్జాతీయ వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్.ఆనంద పద్మనాభన్ రాఘవాచారి అయ్యంగార్ శనివారం కోనసీమలో పర్యటించారు. ఆయనతో పాటు అదే సంస్థకు చెందిన మరో ప్రముఖ వైద్యుడు ప్రసన్న కూడా ఉన్నారు. 30 ఏళ్లుగా హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకునిగా పనిచేసిన అయ్యంగార్ కోనసీమ జిల్లాలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆయన కోనసీమలోని పలు ప్రాంతాలలో సర్వే చేపట్టారు. అయ్యంగార్ స్థానిక ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుకు బాల్యమిత్రుడు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో పాటు వారు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద పద్మనాభన్ మాట్లాడుతూ పాము కాటు బాధితులు కోనసీమలో అధికంగా ఉన్నారని, ఇప్పుడున్న మందులతో అత్యంత విషతుల్య పాము కాట్ల నుంచి రక్షించలేమని అభిప్రాయపడ్డారు. పాము కాటు నుంచి రక్షించే మందులు తయారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, వీటిని ఉచితంగా అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు.